# క్రీస్తు అవతరించిన లోకం

ఆరంభంలో సువార్త రచనలను చదివినవారు క్రీస్తు ప్రభువు అవతరించిన లోకాన్ని గురించి బాగా తెలిసినవారు. కాని, మనలాంటి వారికిది తెలియదు. ప్రభువు జీవించిన దినాల్లో పాలస్తీనా దేశాన్ని గూర్చి, బి. ఎస్. డీన్ యిలా అన్నాడు: "ప్రకృతి దృశ్యము అబ్రాహాము షెకెములో తన గుడారము వేసికొన్నప్పటివలె ఉంది" గాని, "తక్కినదంతా మారిపోయింది."[1] పాత నిబంధన కాలంనుండి ఈ క్రింది మార్పులు జరిగాయి: మత కార్యకలాపాలకు సమాజ మందిరం ప్రధాన రంగమయింది. పరిసయ్యులు, సద్దూకయ్యుల వంటి తెగలు గొప్ప పలుకుబడిని ఉపయోగించారు. దేశము రోమీయులచే పాలింప బడింది. అట్టి మార్పులు ఎలా వచ్చాయి?

## నిబంధనలకు మధ్య కాలం

మార్పులలో ఎక్కువ భాగం సంభవించింది పాత, క్రొత్త నిబంధనలు దాఖలు చేయబడిన మధ్య కాలంలోనే.

పాత నిబంధన ముగించినప్పుడు, అనేక మంది యూదులు బబులోను చెరనుండి కనాను[2] దేశానికి తిరిగి వచ్చి, పారసీకుల అధికారం క్రింద ఉన్నారు. పాత నిబంధనలో వ్రాయబడిన చివరి చరిత్ర రచన నెహెమ్యా; పాత నిబంధన చివరి ప్రవచన పుస్తకం – మలాకీ. యూదులు మెస్సీయా కొరకును ఆయన మార్గాన్ని సిద్ధపరచే వర్తమానికుని కొరకును ఎదురు చూస్తున్నారు. మలాకీ యిలా వ్రాశాడు,

> "ఇదిగో నాకు ముందుగా మార్గము సిద్ధపరచుటకై నేను నా దూతను పంపుచున్నాను; మీరు వెదకుచున్న ప్రభువు, అనగా మీరు కోరు నిబంధన దూత, తన ఆలయమునకు హఠాత్తుగా వచ్చును; ఇదిగో ఆయన వచ్చుచున్నాడని" సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు (మలాకీ 3:1; 4:5, 6లను కూడా చూడు).

### నిశ్శబ్దము

మలాకీకిని సువార్త రచనలలోని సంఘటనలకును మధ్య రమారమి నాలుగువందల సంవత్సరాల[3] నిశ్శబ్ద కాలం గతించిపోయింది. "నిశ్శబ్దం" అంటే, నా ఉద్దేశం – ప్రవచన నిశ్శబ్దమని. ఆ కాలంలో దేవుడు దైవప్రేరేపితులైన ప్రత్యేక వర్తమానికులను పంపలేదు. వ్రాయబడిన ధర్మశాస్త్రము, మరియు ప్రవక్తల లేఖనముల ద్వారా ఇశ్రాయేలీయులు నడిపింపబడ్డారు (మత్తయి 11:13; లూకా 16:16; లూకా 24:44లను చూడు).

దేవుడు తన కుమారుని పంపక ముందు కొన్ని శతాబ్దాలను ఎందుకు గడవనిచ్చాడు? ఎఫ్. లగార్డ్ స్మిత్ కొన్ని అవకాశాలను తెలుపుతున్నాడు:[4] (1) మానవ చరిత్రలో అతి

ముఖ్యమైన సంఘటనలను దేవుడు ప్రదర్శింపగోరి ఉండవచ్చు. ప్రభువైన యేసు చివరిగా వచ్చేసరికి, ఎదురు చూడడం పూర్తిగా హెచ్చుస్థాయిలో నిలిచియుంది. (2) మెస్సీయాను గూర్చిన ప్రవచన నెరవేర్పు హృదయాలకు హత్తుకొని పోయి ఉండేలా అభయమిస్తుంది. (3) మెస్సీయా పని కొరకు రాజకీయ, మత సంబంధమైన పరిస్థితులు సంపూర్తిగా అనుకూలమై ఉండేటట్లు దేవుడు వేచియుండవచ్చు. "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను" అని పౌలు వ్రాశాడు (గలతీ. 4:4ఎ). "సరియైన కాలం వచ్చినప్పుడు, దేవుడు తన కుమారుని పంపెను" అని న్యూ లివింగ్ తర్జుమా అంది.

**ఆధారాలు**

నిబంధన మధ్య కాలంలో ప్రవచన నిశ్శబ్దమున్న మాట వాస్తవమైనా, యూదా ప్రపంచాన్ని రూపుదిద్దిన సంవత్సరాలను గూర్చి మనం ఏమీ ఎరుగలేమని దాని అర్థం కాదు. మనకు సమాచారమందించే పలు విధములైన ఆధారాలున్నాయి.

(1) **అపొక్రిఫల్ రచనలు.** కొన్ని బైబిళ్లలో చేర్చబడ్డ పద్నాలుగు రచనలను "అపొక్రిఫల్" రచనలంటారు. బైబిల్లోని రెండు నిబంధనల మధ్య యివి చేర్చబడ్డాయి. "అపొక్రిఫ" అంటే "దాగియున్న." వీటిని దైవప్రేరేపణములుగా యూదులు గుర్తించరు.[5] ప్రభువు యేసుచే గాని ఆయన అపొస్తలులుచే గాని దైవప్రేరేపితములుగా వీటిని భావింపరు.[6] పారసీకులు మరియు యితర నిజ దేవుని ఎరుగని జనుల మూఢ నమ్మకాలను అవి తెలియజేస్తాయి. ఏదియెలాగున్నా, యూదుల చరిత్ర, వారి ఆచార వ్యవహారాలను గూర్చి తెలిసికొనడానికి అవి సహాయపడతాయి; మొదటి మెకబ్బీలనేది బాగా సహాయపడుతుంది. క్రీ.పూ. 175–132 మధ్య కాలంలో యూదుల చరిత్రను అది తెలుపుతుంది.

(2) **జోసీఫస్ రచనలు.** క్రీ.శ. 37 ప్రాంతంలో జన్మించిన ఒక యూదా చరిత్ర కారుడు ఈ జోసీఫస్. యెరూషలేము పట్టుబడి, లయమైన సమయంలో అతడు సజీవుడుగా మిగిలాడు. అతడు రెండు ముఖ్యమైన రచనలను వ్రాశాడు: *The Antiquities of the Jews* (సృష్టి మొదలు తన ప్రజల యొక్క చరిత్ర) మరియు (క్రీ.పూ. 170నుండి తన కాలంవరకు యూదుల వివరాలు)[7] జోసీఫస్ చెప్పిన కొన్ని "వాస్తవాలు" ప్రశ్నింపబడ్డాయి. అయినా అతని రచనలు గొప్ప సమాచారపు ఆధారాలుగా నిలిచిపోయాయ్.

(3) **గ్రీకు మరియు రోమా రచనలు.** ఈ మూలములు ఈ రచనలో ప్రస్తావించ బడతాయి.

(4) **పురాతన వస్తు పరిశోధనలు.** పాలస్తీనాలోను, యితర స్థలాలలోను కనుగొనబడిన అంశాలు యూదుల చరిత్రమీద, వారి జీవిత విధానం మీద వెలుగును చిమ్ముతాయి.

(5) **లేఖనాలు.** ఈ కాలానికి సంబంధించిన సమాచారం సువార్త రచనలనుండియే ఏరుకొనవచ్చు.

## నాలుగు సామ్రాజ్యాలు

నిబంధనల మధ్య జరిగిన దాదాపు నాలుగువందల సంవత్సరాలలో, దేవుడు

మనుష్యుల వ్యవహారాలలో సంచరిస్తూ, తన ఉద్దేశాలను ఆయన నెరవేర్చుకుంటున్నాడు. బబులోను రాజైన నెబుకద్నెజరు కలయందు, దానియేలు 2లో, ఈ సంవత్సరాలలో ఉండే రాజకీయ పరిస్థితులు సంక్షిప్తంగా వర్ణించబడ్డాయి.

> ... ఈ గొప్ప ప్రతిమ మహా ప్రకాశమును, భయంకరమునైన రూపమును గలదై తమరి యెదుట నిలిచెను. ఆ ప్రతిమయొక్క శిరస్సు మేలిమి బంగారుమయ మైనదియు, దాని రొమ్మును భుజములును వెండివియు, దాని ఉదరమును తొడలును ఇత్తడివియు, దాని మోకాళ్లు ఇనుపవియు, దాని పాదములలో ఒక భాగము ఇనుపదియు ఒక భాగము మట్టిదియునైయుండెను (దానియేలు 2:31-33).

తానును (బబులోను సామ్రాజ్యమును) ఆ బంగారు శిరస్సును సూచించుచున్నట్టు దానియేలు రాజైన నెబుకద్నెజరునకు తెలిపెను (37, 38 వచనాలు). అప్పుడు ప్రవక్త యిలా అన్నాడు:

> తాము చనిపోయిన తరువాత తమరి రాజ్యముకంటె తక్కువైన రాజ్యమొకటి లేచును. అటు తరువాత లోకమంత యేలునట్టి మూడవ రాజ్యమొకటి లేచును. అది యిత్తడి వంటిదగును. పిమ్మట నాలుగవ రాజ్యమొకటి లేచును. అది ఇనుమువలె బలముగా ఉండును. ఇనుము సమస్తమైనవాటిని దంచి విరుగగొట్టునది గదా; ఇనుము పగులగొట్టునట్లు అది రాజ్యములన్నిటిని పగులగొట్టి పొడిచేయును (39, 40 వచనాలు).

దానియేలు 2లోని నాలుగు రాజ్యాలు (1) బబులోను సామ్రాజ్యము, (2) మాదీయ – పారసీక రాజ్యము, (3) గ్రీకు సామ్రాజ్యము, మరియు (4) రోమా సామ్రాజ్యమని అటు లేఖనములవలనను, యిటు చరిత్రవలనను మనం తెలిసికోగలం.[8]

పాత నిబంధన రచన ముగింపక ముందు, మొదటి సామ్రాజ్యం (బబులోను) కూలిపోయి, రెండవది (మాదీయ పారసీక రాజ్యం) అధికారంలోనికి వచ్చింది (దానియేలు 5:28, 30, 31; 6:8, 12, 15, 28; 8:20; 10:1; 11:1; ఎజ్రా 1:1-4; ఎస్తేరు 1:19లను చూడు). అలాటప్పుడు, మన అక్కర, రెండు, మూడు, మరియు నాలుగు రాజ్య కాలాల్లో జరిగిన సంభవాలకు సంబంధించినదే.

### మాదీయ – పారసీక కాలం[9] (క్రీ.పూ. 539-333[10])

ముందుగా గమనించినట్టే, పాత నిబంధన రచన ముగించే సమయానికి పారసీకులు కనానును వశపరచుకున్నారు, ప్రాథమికంగా యిది యూదులపట్ల సహనము చూపిన కాలం. పారసీక అధిపతికి లోబడియున్నంతవరకు – ప్రధాన యాజకుడు యూదుల రాజ్యాన్ని ఏలడానికి అనుమతించారు.

ఈ కాలంలో, తిరిగి వచ్చే యూదులకును, కనానులో నివసించుతున్న సంకలన జనానికిని మధ్య ఉద్రిక్తత పెరిగింది (ఎజ్రా 4:4; నెహెమ్యా 4:1-8లను చూడు). ఈ నివాసులు ఎక్కువగా యూదయకు ఉత్తర దిశగా సమరయ అనబడే ప్రాంతంలో స్థావరాలు

ఏర్పాటు చేసికొన్నారు (ఎజ్రా 4:10, 17; నెహెమ్యా 4:2లను చూడు). వారు సమరయులుగా పిలువబడ్డారు.[11] సమరయులు యెహోవా దేవుని ఆరాధనతో ఎలా కలసిపోయారో 2 రాజులు 17:24–33 తెలుపుతుంది. తమ దేవతల ఆరాధనతో దీనిని కలిపివేశారు. "ఈ ప్రకారముగా వారు యెహోవాయందు భయభక్తులుగల వారైయుండి, తాము ఏ జనులలోనుండి పట్టబడిరో ఆయా జనుల మర్యాద చొప్పున తన దేవతలను పూజించుచుండిరి" అని 33వ వచనం అంటుంది. ప్రభువైన యేసు వచ్చే సమయానికి సమరయులు దేశంలోని మధ్య కేంద్రాన్ని ఆక్రమించు కొన్నారు (యోహాను 4:3, 4). యూదుల సమరయుల మధ్య చెడిన బాంధవ్యం యేసుకు సంబంధించిన అనేక సంఘటనలకు పూర్వగాథగా నిలిచియుంటుంది (లూకా 10:33; 17:16; యోహాను 4:9).

## గ్రీకు సామ్రాజ్య కాలం[12] (క్రీ.పూ. 333–165)

(1) **మహా అలెగ్జాండరు (క్రీ.పూ. 333-323).** క్రీ.పూ. 336లో, ఇరవైయేండ్ల ఈడుగల మహా అలెగ్జాండరు గ్రీకు సైన్యాధిపతిగా పనిని చేపట్టాడు. కొద్ది సంవత్సరాలలోనే అతడు లోకాన్ని జయించాడు. అతని విజయ యాత్రల కాలంలో, తూరు పట్టణాన్ని నిర్మూలము చేసి, దానికి విరోధంగా యెహెజ్కేలు 26, 28ల్లో ఉన్న ప్రవచనాలను నెరవేర్చాడు. అతని ప్రభావంవలన గ్రీకు నాగరికత ప్రపంచమంతా వ్యాపించింది. అలెగ్జాండ్రియా అనే ఒక పట్టణాన్ని నైలునదిమీద నిర్మించి, గ్రీకు ప్రాబల్యానికి కేంద్రంగా దాన్ని చేశాడు. క్రైస్తవులకు యిందులో విశేషమేమంటే, గ్రీకు సార్వత్రిక భాషగా మారిపోయింది. క్రొత్త నిబంధన *koine* (సాధారణమైన) గ్రీకులో వ్రాయబడింది.[13]

క్రీ.పూ. 333 ప్రాంతంలో అలెగ్జాండరు యెరూషలేమును స్వాధీనం చేసికొన్నాడు. పట్టణపు ప్రాకారానికి వెలుపల ప్రధాన యాజకుడు అలెగ్జాండరును కలిసికొని అతని ఎలా ఆహ్వానించాడో జొసీఫస్ మనకు వివరించాడు. అలెగ్జాండరు ప్రత్యేకమైన ఆధిక్యతలను యూదులకు యిచ్చాడు. అతడు వారిని అన్య దేశాల్లో నివసించేందుకు అనుమతించి, మహా విశాలమైన తన సామ్రాజ్యంలో వారు స్థిర నివాసాలు ఏర్పరచు కునేలా ప్రోత్సహించాడు.

ఈ కాలంలో, యూదులలో ప్రత్యేకింపబడిన తెగగా శాస్త్రులు ప్రత్యక్షమయ్యారు. ఈ శాస్త్రులను గూర్చి యింకా ఎక్కువగా తరువాత చెప్పబోతాను.

క్రీ.పూ. 323లో అలెగ్జాండరు మరణం తరువాత, యిరవై సంవత్సరాలు అధికారం కొరకైన పోరు జరిగింది. చిట్టచివరికి, అతని రాజ్యము నాలుగు భాగాలుగా విడిపోయింది: గ్రీసు, ఆసియా, ఐగుప్తు, మరియు సిరియాలుగా స్థిరపడింది.[14] మనకు ఆసక్తిని పుట్టించేవి ఐగుప్తు, సిరియా అనేవి. టాలమీలు[15] ఐగుప్తును వశపరచుకొన్నారు, సెల్యూకసులు[16] సిరియాకు ఏలికలుగా ఉన్నారు.

(2) **టాలమీలు** (Ptolemies) **(క్రీ.శ. 323-198).** ఐగుప్తు, సిరియా అనే రెండు అధికారాల పోరాటం మధ్య పాలస్తీనా చిక్కుబడింది.[17] ఐగుప్తు సేనలు సిరియా వైపుకు తరలి వచ్చేటప్పుడు, ఉత్తరాన ఉన్న పాలస్తీనాను వారు పట్టుకుంటారు. సిరియా సేనలు

దక్షిణాన ఉన్న ఐగుప్తువైపు తరలి వచ్చేటప్పుడు, అటు వచ్చేటప్పుడుగాని, వెళ్లేటప్పుడుగాని పాలస్తీనాను పట్టుకుంటారు.

తరువాత ఒక వంద సంవత్సరాలపాటు, యూదులు అప్పుడప్పుడు సిరియా వశమైయుంటారు గాని, ఎక్కువ కాలం మాత్రం వారు ఐగుప్తు స్వాధీనంలోనే ఉంటారు. టాలమీ I యెరూషలేమును పట్టుకొని, అలెగ్జాంఁడ్రియాలో అనేకమంది యూదులకు స్థిర నివాసం ఏర్పరచాడు. వారికి సంపూర్ణ పౌరత్వమిచ్చి, వారి పాండిత్యాన్ని ప్రోత్సహించాడు.

టాలమీల ఏలుబడి కాలం ప్రాథమికంగా యూదులకు నెమ్మదిగా ఉండేది. అందులో చెప్పుకోదగిన సాధన, ఐగుప్తులో సెప్టూజంట్ తర్జుమా. అలెగ్జాంఁడ్రియాలోని గొప్ప గ్రంథాలయంకొరకు, రెండవ టాలమీ (టాలమీ II) హెబ్రీయుల లేఖనాలను గ్రీకులోనికి తర్జుమా చేయనాజ్ఞాపించాడు. ఈ తర్జుమా క్రీ.పూ. 285కు ముగించబడింది. పారంపర్యం ప్రకారం, ఈ తర్జుమా డెబ్బైమంది యూదా పండితులచే చేయబడింది. (అందువలన "డెబ్బై" అని అర్థమిచ్చే "సెప్టూజంట్"[18] అనే పేరు వచ్చింది). క్రొత్త నిబంధన లేఖకుల లేక వక్తల కొటేషన్లు సెప్టూజంట్‌నుండి వచ్చాయి.

ఈ కాలమంతటిలో ఐగుప్తు సిరియాలకు మధ్య పోరు జరుగుతునే ఉంది. చివరికి, క్రీ.పూ. 198 ప్రాంతానికి పాలస్తీనా సిరియా ఆధిపత్యం క్రిందికి వచ్చింది.

(3) సెల్యూకసులు (Seleucids) (క్రీ. పూ. 198-165). ఈ దేశాన్ని పాలించడానికి అనుకూలంగా వారు పాలస్తీనాను: యూదయ, సమరయ, గలిలయ, పెరియా, (ఇతూరియా), త్రకోనీతి – అనే అయిదు భాగాలుగా విభజించారు. వీటిని గూర్చి తరువాత ఎక్కువగా తెలిసికొంటాం.

యూదా మత చరిత్రలో సిరియనుల ఏలుబడి కాలము బహు అంధకారమయ మైనదిగా ఉండేది. వీరిలో ప్రధానమైన దుర్మార్గుడు నాల్గవ అంతియోకస్ (Antiochus IV). ఇతన్ని అంటియోకస్ ఎపిఫినాస్ అని కూడా పిలుస్తారు. "ప్రజాధికారాన్ని పొందిన అతి క్రూరులలో ఒకడు" అని ఎఫ్. లగార్డ్ స్మిత్ అతనికి పేరుపెట్టాడు.[19] ఎపిఫినాస్ (క్రీ.శ. 175–165) యూదులను ద్వేషించి, వారిని గ్రీసు దేశస్థులుగా చేయ ప్రయత్నించాడు. యెరూషలేములో జూపిటర్‌కు ఆలయం నిర్మించి, యూదా మతాన్ని రూపుమాప ప్రయత్నించాడు. అతడు దేవాలయాన్ని మూత వేయించి, సున్నతిని చట్ట విరుద్ధం చేసి, యూదా మతాన్ని ఆచరించే ఎవడికైనా చావేనని శాసించాడు. వేలకొలదిమంది యూదులను బానిసలుగా అమ్మివేసి, యింకా వేలాదిమందిని సంహరించాడు. అతడు దేవాలయాన్ని దోచుకొని, బలిపీఠంమీద పందిని బల్యర్పణగా చేశాడు.[20] ఆ బూడిదను "నీట కలిపి," ఆ నీళ్లను దేవాలయమంతటా చల్లాడు, పరిశుద్ధమైన ఆ కట్టడాన్ని విసర్జించేలా అతడు చేశాడు.

## స్వాతంత్ర్యాన్ని పొందిన కాలం (క్రీ.పూ. 165–63)

ఆంటియోకస్ ఎపిఫినాస్ చేసిన చిత్రహింస యూదుల తిరుగుబాటుకు దోహదం చేసింది. మత్తయాస్ అనే ఒక వృద్ధ యాజకునిచే అది నడిపించబడింది. మత్తయాస్‌కు

ధైర్యవంతులును యుద్ధశూరులునైన అయిదుగురు కుమారులుండిరి. వారిలో యూదా అనే ఒకడు – తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. "సుత్తియైన యూదా" అని అతడు పిలువబడ్డాడు. "మెక్కబీ" అనేది "సుత్తి"కి గ్రీకు రూపం. అందును బట్టి ఈ కాలాన్ని యూదుల చరిత్రలో మెక్కబీల కాలం అనబడింది.[21] క్రీ.శ. 165లో యూదా మెక్కబీ యెరూషలేమును తిరిగి వశపరచుకున్నాడు. దేవాలయం పవిత్రపరచబడి, తిరిగి అది యెహోవా దేవునికి ప్రతిష్ఠించబడింది. ఆలయ ప్రతిష్ఠ పండుగకు ఆరంభమది (యోహాను 10:22 చూడు).

క్రీ.పూ. 163నుండి 143వరకు, సిరియాతో యుద్ధం కొనసాగింది. కడకు, యూదులు తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోగలిగారు. క్రీ.పూ. 135లో, జాన్ హిర్కానాస్ క్రింద యూదుల రాజవంశం స్థాపించబడింది.

ఈ కాలంలో యూదులలో – పరిసయ్యులు, సద్దూకయుల తెగలు లేచాయి. ఇవి యింకా యితర తెగలను గూర్చి తరువాత మాట్లాడుకుందాం. ఈ కాలంలో ప్రధాన యాజకుని పదవి మత సంబంధమైన దానికంటె ఎక్కువ రాజకీయ సంబంధమైనదిగా మారిపోయింది. అధికారంలో ఎవరు ఉంటారో వారిచే ప్రధాన యాజకుడు నియమింప బడుతూ వచ్చాడు.[22]

ఈ కాలపు అంతంలో అంతరంగ కలహాలు చోటుచేసికొన్నాయి. జాన్ హిర్కానస్ సంతతిలోని పలువురు సింహాసనంకొరకు పోటీపడ్డారు. కుట్రలు, వ్యతిరేకపు పన్నాగాలు, రాజకీయ హత్యలు చోటుచేసికొన్నాయి. వీరిలో ఒక ముఠావారు – రేగుతున్న రోము అధికారాన్ని ఆశ్రయించారు. యూదుల వ్యవహారాలలో రోమును ఆహ్వానించజూడడం, కోడి పిల్లల తగాదాల పరిష్కారానికి నక్కను ఆహ్వానించినట్లౌతుంది. ఆలాటి పరిస్థితుల్లో, యూదులు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

### రోమీయుల కాలం (క్రీ.పూ. 63–క్రీ.శ. 70[23])

క్రీ.పూ. 63లో[24] మహా పాంపే యెరూషలేమును జయించాడు. క్రీస్తు ప్రభువు యొక్క భూ నివాస కాలంలో ఔగుస్తు (ఆక్టేవియస్) కైసరు (క్రీ.పూ. 27 – క్రీ.శ. 14). (లూకా 2:1). తిబెరయ కైసరు (క్రీ.శ. 14–37) (లూకా 3:1).[25]

రోముకు బాధ్యులైయున్న ఏలికల క్రింద పాలస్తీనా ఉంచబడింది. తాత్కాలికంగా, అంతిప (Antipater) యూదయకు ఏలికగా చేయబడ్డాడు. అతని కుమారుడైన మహా హేరోదు అతనికి వారసుడై, యూదయకు రాజుగా క్రీ.పూ. 37–3 ఉండిపోయాడు (లూకా 1:5).[26] హేరోదు పరిపాలనా వివేకిగా ఉన్నాడు, అయితే అతని దుష్టత్వం అతని పరిపాలనా నైపుణ్యానికి మించింది. రథ సారధ్యపు పోటీలు, యింకా యితర గ్రీకుల ఆచార వ్యవహారాలను ప్రవేశపెట్టి యూదుల ద్వేషాన్ని రేపాడు. తిరిగి వారి అభిమానాన్ని పొందడానికిగాను, అతడు దేవాలయాన్ని తిరిగి కట్టడాన్ని ఆరంభించాడు (యోహాను 2:20ని చూడు). అది మొదట అంతియోకస్ ఎపిఫినాస్‌చే నాశనం చేయబడింది. ప్రభువైన యేసును లయపరచగోరి పసి పిల్లలను చంపించిన దుష్టుడైన రాజు ఈ హేరోదే (మత్తయి 2:1–18).

మహా హేరోదు చనిపోయినప్పుడు (మత్తయి 2:19), దేశము "నలుగురు ఏలికల" చేతిలో పెట్టబడింది: (1) తాత్కాలికంగా, హేరోదు కుమారుడైన అర్కెలాయు యూదా సమరయులపై ఏలికగా నియమింపబడ్డాడు (మత్తయి 2:22). క్రీ.శ. 6లో అతడు గద్దెనుండి దింపబడ్డాడు. తరువాత వరుసగా అధిపతులు నియమింపబడుతూ వచ్చారు. (పిలాతు ఆరవ అధిపతి [లూకా 3:1 ].) (2) మహా హేరోదు యొక్క మరొక కుమారుడు హేరోదు అంతిప (కొన్ని సార్లు కేవలం "హేరోదు" అనియు, మరికొన్ని సార్లు "చతుర్థాధిపతియైన హేరోదు" అనియు క్రొత్త నిబంధనలో పిలువబడ్డాడు) అనువాడు గలిలయకును పెరియాకును చతుర్థాధిపతిగా నియమించబడ్డాడు (లూకా 3:1; మత్తయి 14:1 కూడా చూడు). ప్రభువైన యేసు పరిచర్య కాలంలో ఉన్న యితడు హేరోదులలో బహుగా తెలియబడినవాడైయున్నాడు.[27] (3) మహా హేరోదు యొక్క మూడవ కుమారుడు ఫిలిప్పు. ఇతడు "ఇతూరయ, త్రకోనీతి అనే భాగాలకు చతుర్థాధిపతిగా" ఉన్నాడు.[28] (లూకా 3:1; మత్తయి 14:3లను చూడు). ఈ ప్రాంతాన్ని కొన్ని సార్లు బాషాను జిల్లా అని కూడా అంటారు.[29] (4) నాల్గవ ప్రాంతము అబిలేనే,[30] లుసానియకు యివ్వబడింది, యితడు హేరోదీయుడు కాడు (లూకా 3:17). అబిలేనే అనేది మహా హేరోదు ఏలుబడి చేసిన ప్రాంతంలోని భాగం కాదు.

రోమీయులు యూదులకు అనేక రాయితీలు యిచ్చారు: వారు సైనిక బాధ్యతలనుండి వైదొలగింపబడ్డారు. సబ్బాతు దినాన వారు న్యాయ సభకు హాజరు కానవసరం లేదు. ఏ బొమ్మా లేకుండ కేవలం వ్రాతలోనే రాగి నాణ్యాలు ముద్రించుకునే అవకాశం వారి కివ్వబడింది.[31] రోమా సైనికులు వీరి దేశంలో బొమ్మలుగల జెండాలు పట్టుకొని వెళ్లకుండ నిర్బంధింపబడ్డారు.

రోమీయుల కాలము ప్రభువుకొరకు మార్గం ఎలా సిద్ధపరచింది అనేదే క్రైస్తవులకు యిందులో గల విశేష ఆసక్తి. అది సిద్ధపరచిన మార్గాల్లో *Pax Romana* (రోమీయుల శాంతి), సార్వత్రిక భాషను (గ్రీకును) ప్రోత్సహించడం, సామ్రాజ్య వ్యాప్తంగా రాకపోకల సౌకర్యంతో కూడిన రోడ్ల రవాణా వగైరాలను నిర్మించడం చేర్చబడ్డాయి.

## పాలస్తీనా దేశం

క్రీస్తు జన్మించబోయే దేశాన్ని పాత నిబంధన కాలంలో "కనాను" అని పిలిచారు (ఆది. 12:5; నిర్గమ. 6:4; యెహోషువ 14:1). క్రొత్త నిబంధనలో ఈ పేరు కానరాకపోయినా,[32] క్రొత్త నిబంధన కాలానికి యిది "పాలస్తీనాగా"[33] తెలియబడింది.

ప్రభువైన యేసు కదలికలను కనుపరచడానికి సహాయపడే దేశ పటాలు ఈ వరుసలో ప్రదర్శించబడతాయి. క్రీస్తు జీవితంలోని 150 సంఘటనలను సువార్త లేఖకులు దాఖలు చేశారు. వీటిలో దాదాపు 100 ప్రత్యేకించిన భౌగోళిక స్థలాలతో ముడివేయబడ్డాయి.

ముందుగా చూపబడిన పటాన్ని చూడు. దానునుండి బెయేర్షెబావరకు అని ఈ దేశపు పొడవునుగూర్చి మాట్లాడతారు (న్యాయాధి. 20:1; 1 సమూ. 3:20; 1 రాజులు 4:25లను చూడు). ఉత్తరమున దానునుండి దక్షిణమున ఉన్న బెయేర్షెబావరకు గల

దూరము 150 మైళ్లు. ఈ భూ భాగం 10,000నుండి 12,000 చదరపు మైళ్లవరకు విస్తీర్ణం గలదైయుంటుంది.[34] పోల్చి చూడదలచుకుంటే మన దేశంలోని అనేక రాష్ట్రాలు దీనికంటే పెద్దవి.[35]

యొర్దాను నదికి ఉత్తరాన ఉన్న మూడు రాష్ట్రాలు క్రీస్తు జీవితంలో ముఖ్యమైవి.[36] (1) *యూదయ.* యూదయ ప్రాంతం యూదులచే ప్రబలమైయుంటుంది. తమ మత నిష్ఠ విషయంలో యూదయ ప్రాంతీయులు గర్విస్తూ ఉంటారు. ప్రభువైన యేసు తరచుగా, ప్రత్యేకించి పండుగ సమయాల్లో – సందర్శించేవాడు. (2) *సమరయ.* మనం ముందుగా చూచినట్టే, సమరయ – "సమరయులు" అని పిలువబడే సంకరజాతి మనుష్యులచే స్థిర నివాసాలు ఏర్పరచుకొనబడింది. ఉత్తరానికిగాని, దక్షిణానికిగాని ఆయన తరలి వెళ్లినప్పుడు, ప్రభువు కొన్ని సార్లు సమరయుల గుండా వెళ్లతాడు. (3) *గలిలయ.* గలిలయులు, యూదులు, అన్యజనుల మిశ్రమైయుంటుంది (మత్తయి 4:15 చూడు). అది వెనుకబడిన ప్రాంతంగా యూదయవారిచే భావించబడేది. ప్రభువైన యేసు తన జీవితంలో ఎక్కువ భాగం గలిలయలోనే గడిపాడు.

దేశ పటంలో ఉన్న తక్కిన ప్రాంతాలు కూడా ప్రభువు జీవితానికి ముఖ్యమైనవే. అనేక సందర్భాల్లో, క్రీస్తు గలిలయ సముద్ర తూర్పు తీరాన్ని దాటాడు. దాన్ని పటంలో "బాషాను జిల్లా" సూచించడమయ్యింది.[37] "ఇతూరయ త్రకోనీతియని" ఈ ప్రాంతాన్ని లూకా 3:1 పిలుస్తుంది. ఈ ప్రాంతం యొక్క దక్షిణ భాగాన్ని "దెకపొలి" అని పిలుస్తారు. దానికి "పది పట్టణాలని"[38] అక్షరార్థం. (మత్తయి 4:25; మార్కు 5:20; 7:31).

ప్రభువు పరిచర్య అంతం సమీపించినప్పుడు, ఆయన గలిలయనుండి అనేక మారులు ప్రక్కకు వెళ్లేవాడు. వాటిలో ఒక మారు పశ్చిమ ప్రాంతమైన తూరు సీదోనులకు వెళ్లాడు. ఆ పట్టణాలు ఫెనీకే దేశానికి సంబంధించినవి (మత్తయి 15:21). యొర్దాను తూర్పు వైపునకు కూడా ఆయన పలుమార్లు వెళ్లాడు. జొసీఫస్ ప్రకారం ఈ ప్రాంతం "పెరియా," అయితే సువార్త రచనల్లో ఉపయోగింపబడిన పద ప్రయోగము "యొర్దాను అవతల ప్రాంతం" అని (మత్తయి 4:25; 19:1; మార్కు 10:1; యోహాను 10:40). ("యొర్దాను అద్దరికి"ని వచ్చెను).

దేశ పటంలో కొన్ని కీలకమైన భౌగోళిక స్థలాలు గుర్తించబడ్డాయి. ప్రతి సంచికలోను ఆ సంచికలో చర్చింపబడిన సంగతులను సూచించడానికి ఒక దేశ పటం యివ్వబడుతుంది.

ఈ దేశ పటాల విషయంలో ఓ చిన్న హెచ్చరిక అవసరం కావచ్చు. బైబిలు వివరాలు, మతేతర మూలాలనుండి ప్రాథమిక దేశపు విభాగాలు అంత తేటగా లేక పోయినప్పటికిని, ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎల్లలు (హద్దులు) ఖచ్చితంగా లేవు. గనుక, ఆయా రాష్ట్రాలకు మధ్య గీయబడిన హద్దులు కేవలం రమారమిగా సూచించబడినవేనని గ్రహించాలి.

## ఇతర మార్పులు

పాత నిబంధన యొక్క ముగింపు దినాలు మరియు నిబంధనల మధ్య కాలం కూడా యితర మార్గాలలో యూదుల లోకం మీద ప్రభావాన్ని కనుపరచాయి.

## పేర్లలో మార్పులు

పాత నిబంధన ముగించే సమయానికి, దేవుని ప్రజలు "యూదులు"గా తెలియబడ్డారు (ఎజ్రా 4:12; 5:1). ఈ పేరు దక్షిణ రాజ్యమైన యూదానుండి వచ్చింది. బబులోను చెరనుండి తిరిగి వచ్చినవారిలో అధిక సంఖ్యాకులు ఆ ప్రాంతపు సంతతివారు (మరియు యూదా గోత్రికులునైయుండిరి). క్రొత్త నిబంధన కాలం వచ్చేసరికి, ఈ ప్రజలకు ఉపయోగింపబడిన ప్రాథమిక నామం "యూదులే" (మత్తయి 2:2; యోహాను 1:19).

వారు యింకను ఆయా సమయాల్లో "ఇశ్రాయేలని" పిలువబడ్డారు (యోహాను 1:47; 2 కొరింథీ. 11:22లను చూడు). వారు ఇశ్రాయేలు సంతతివారని చెప్పడానికి యిలా సూచింపబడ్డారు. కొన్ని సార్లు వారు "హెబ్రీయులని" కూడా పిలువబడ్డారు (అపొ. 6:1; 2 కొరింథీ. 11:22). ఇది వారి పారంపర్యపు భాషను బట్టి జరిగింది.

## భాషలో మార్పులు

బబులోను చెరనుండి తిరిగి వచ్చిన పిమ్మట, హెబ్రీ స్థానంలో యూదుల మధ్య అరామి చోటు చేసికొంది. అరామి, సిరియా ప్రాంతీయ భాష, హెబ్రీలా ఉంటుంది. ఇటాలియన్ లాటిన్ను పోలియున్నట్టు, ఇటాలియన్ పాఠశాల విద్యార్థులు లాటిన్ను చదివినట్టే యూదుల బాలురు పాఠశాలల్లో హెబ్రీ నేర్చుకుంటారు.

ప్రభువైన యేసు భూమిపై జీవించిన దినాల్లో సార్వత్రికమైన భాష గ్రీకు, రోమా ప్రభుత్వపు అధికారిక భాష లాటిన్. ప్రభువైన యేసు సిలువపై వ్రేలాడదీయబడినప్పుడు, ఆయన తలపై విలాసము: హెబ్రీ, లాటిన్, గ్రీకు భాషలలో వ్రాయబడింది (యోహాను 19:20).

## వృత్తిలో మార్పులు

చెరకు ముందు, యూదులు ప్రధానంగా వ్యవసాయకులు, మందలను కాచుకునే వారు. చెర కాలంలో వారి ఆస్తులనుండి వేరుచేయబడినవారై, వ్యాపార నిపుణతలు తమకు కలిగియున్నవని వారు కనుగొన్నారు. ప్రభువు కాలంలో, యూదులు వ్యాపారులుగా లోకమందంతట చెదరియున్నారు.

## ఆరాధనలో మార్పులు

యెరూషలేములోని దేవాలయం యూదులకు ముఖ్యమై ఉండేది. బబులోను చెరానంతరం జెరుబ్బాబెలుచే కట్టబడిన దేవాలయంలో ఎక్కువ భాగం ఎపిఫినాస్చే నాశనం చేయబడింది. ప్రభువైన యేసు జన్మకు పదహారు సంవత్సరాల ముందునుండి మహా హేరోదు దేవాలయం తిరిగి కట్టనారంభించాడు (యోహాను 2:20 చూడు). ప్రభువు పరిచర్య కాలంలో ఆ ప్రాజెక్టు యింకా కొనసాగుతునే ఉంది.[39] నమ్మకమైనవారు పండుగలకొరకు పాలస్తీనాలోని దేవాలయానికి సంవత్సరానికి కొన్ని సార్లు తరలి వస్తూనే ఉండేవారు.[40] పవిత్ర భక్తిగల యూదులు ఆయా దేశాలనుండి మాటి మాటికి యెరూషలేముకు కష్టతరమైన ప్రయాణం చేస్తూనే ఉండేవారు (అపొ. 2:5–11).

ఏదియెలాగున్నా, ప్రభువు భూలోక ప్రవేశం చేసే సమయానికి, యూదుల మధ్య మత సంబంధమైన జీవితానికి సమాజ మందిరం గుండెగా ఉండేది. పాత నిబంధనలో సమాజ మందిరం యొక్క ప్రస్తావన లేదు. కాని క్రొత్త నిబంధనలో ప్రధానంగా కన్పించింది (మత్తయి 12:9; 13:54). యూదులు చెరలో ఉన్నప్పుడు సమాజ మందిరం ప్రారంభింపబడి ఉండవచ్చు. ఎందుకంటె, నియమింపబడిన పండుగ దినాలకు వారు యెరూషలేము వెళ్లలేక పోయినట్టున్నారు. కేవలం పదిమంది పురుషులుంటే, అక్కడ యూదులు ఇక సమాజ మందిరాన్ని నిర్మించుకోవచ్చు.[41] యెరూషలేములోను లోక వ్యాప్తంగాను వందలకొలది సమాజ మందిరాలు ఉండేవి. సబ్బాతు దినాన సమాజ మందిర కార్యక్రమాలు సాధారణంగా పాటలు, ప్రార్థనలు, లేఖనాలు పఠనంతో కూడి ఉండేవి.[42] సమాజ మందిరాలను ఆనుకొని యూదుల పిల్లలు హాజరు కావలసిన పాఠశాలలుండేవి.

## మత నాయకత్వంలో మార్పులు

పాత నిబంధనలో, యాజకులు గుర్తింపబడిన మత నాయకులైయున్నారు. దేవునిచే అప్పుడప్పుడు పంపబడే ప్రవక్తచే వారి పనికి అనుబంధం కలిగించబడుతూ ఉండేది. క్రీస్తు జీవితాన్ని మనం చదువుతూ ఉండగా, యాజకులు మరియు వారికి సహాయకులైన లేవీయులను ఎదుర్కొంటూనే వస్తాం (లూకా 10:31, 32). ప్రభువు పరిచర్య కాలంలో, ప్రత్యేకమైన ప్రముఖ వాస్తవమేమంటే – యూదా మతానికి యిద్దరు ప్రధాన యాజకులు న్నట్టున్నారు (లూకా 3:2 చూడు). రోమా అధిపతిచే అన్నా ప్రధాన యాజకుని పదవినుండి తొలిగింపబడ్డాడు, కాని తన అల్లుడు ప్రధాన యాజకునిగా నియమింపబడేలా పలుకుబడి కలిగినవాడైయున్నాడు (యోహాను 18:13; మత్తయి 26:3, 57; యోహాను 11:49; 18:24). అనేక మంది యూదుల దృష్టిలో, అన్నాయే నిజమైన ప్రధాన యాజకుడుగా నిలిచియున్నాడు (అపో. 4:6).

క్రొత్త నిబంధన కాలం వచ్చేసరికి, యాజకులతో పాటు క్రొత్త నాయకత్వం రంగ ప్రవేశం చేసింది. మొదటివారు రబ్బీలు (మత్తయి 23:7, 8),[43] వీరు సమాజ మందిరం లోను, సమాజ మందిరపు పాఠశాలలోను ఉపధ్యాయులుగా ఉండేవారు. యాజకుల స్థానంలో, రబ్బీలు మతాధికారులుగా వ్యవహరించారు. కొందరికైతే, ధర్మశాస్త్రానికి ఎంత విలువ ఉంటుందో, ధర్మశాస్త్రాన్ని వ్యాఖ్యానించే రబ్బీ వ్యాఖ్యానానికి అంతే విలువ ఉంటుంది.[44]

తరువాత వారు, ముందుగా ప్రస్తావింపబడిన శాస్త్రులు (మత్తయి 2:4; 5:20; 7:29; 9:3). శాస్త్రి అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి అక్షరార్థం "లేఖకుడు." ఆదిలో, ప్రాముఖ్యమైన సంఘటనలను దాఖలు చేయడం శాస్త్రుల బాధ్యతయై ఉండేది.[45] క్రొత్త నిబంధన కాలం వచ్చేసరికి, పాత నిబంధన ప్రతులను వ్రాసే బాధ్యతను వారు వహిస్తుండేవారు. వారు ధర్మశాస్త్రంపై ప్రమాణికులన్నట్టు, కొన్ని సార్లు వారిని (లాయర్స్) "ధర్మశాస్త్రోపదేశకులని" పిలిచేవారు (లూకా 7:30; 11:45, 46, 52).[46] వారు సాంఘీక చట్టంలో ప్రఖ్యాతిగలవారు కారు, కాని మత సంబంధమైన చట్టంలో వారు గొప్పవారుగా ఎంచబడ్డారు. శాస్త్రులలో అనేకమంది పరిసయ్యులై ఉంటారు. (పరిసయ్యులపై చర్చను తరువాత చూడు).[47]

అప్పుడు సన్‌హెడ్రిన్ (సభ) ఉండేది. సన్‌హెడ్రిన్ అనేది యూదుల "అత్యున్నత న్యాయ స్థానం." "సన్‌హెడ్రిన్" అనేది "సభ" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం యొక్క రూపం (మత్తయి 26:59; మార్కు 15:43; లూకా 22:66). "సన్‌హెడ్రిన్" అని NIVలో తర్జుమా చేయబడింది. చరిత్రలో సన్‌హెడ్రిన్ అనేది క్రీ.పూ. 200 ప్రాంతంలో కన్పించింది. యూదుల దేశపు అంతరంగ వ్యవహారాలను నడిపించే బాధ్యతగల కూటమిగా అది ఉండేది. పారంపర్యంగా, సన్‌హెడ్రిన్‌లో డెబ్బైమంది సభ్యులుంటారు – వారికి తోడు అధ్యక్షుడుగా పని చేసే ప్రధాన యాజకుడు ఉంటాడు. అందులో అధిక సంఖ్యాకులు సద్దూకయులు. ("సద్దూకయుల"పై చర్చను చూడు). అయితే శక్తివంతమైన పరిసయ్యుల స్వల్ప సంఖ్యాకులుంటారు. ("తెగలమీద" చర్చను చూడు).[48]

పైన పేర్కొన్న పలుకుబడి కలిగిన యూదులందరు తమ అధికారపు అంతస్థును కాపాడుకొనడం ముఖ్యమైయుంటుంది. ఆ విధంగా వారు ప్రభువుకు మహా గొప్ప శత్రువులుగా రూపొందారు.

## తెగల అభివృద్ధి

ప్రభువు భూనివాస కాలంలో, యూదుల తెగలు అనే ప్రత్యేక అంశాన్ని వేరుగా చర్చించడం తగినదైయుంటుంది. మతపరంగా అవి ఎంతగా ఉద్దేశింపబడ్డాయో, రాజకీయంగాను సాంస్కృతికంగానూ అవి అంత ఉద్దేశపూర్వకమైనవి.

### పరిసయ్యులు[49]

"పరిసయ్యు"డనేది "వేరుచేయు" అని అర్థమిచ్చునట్టి హెబ్రీ క్రియా వాచక రూపం నుండి వచ్చింది. గ్రీకు నాగరికతను అంగీకరించుడని యూదులు బలవంత పెట్టబడిన సెల్యూకసుల కాలంనుండి ఈ తెగ ఉద్భవించిందని కొందరు తలంచుతారు. ఆదిలో, పరిసయ్యులు దేశభక్తిని మతభక్తితో పెనవేసినవారుగా ఉండేవారు. అయితే, ప్రభువైన యేసు దినాలు వచ్చేసరికి, వారు స్వనీతిపరులును వేషధారులుగాను దిగజారిపోయారు (మత్తయి 23:1–36). వారు సంఖ్యలో కొద్ది మంది, కాని ప్రజల మధ్య ఖ్యాతిగలవారై ఉండి, చెప్పుకోదగినంత పలుకుబడిని సంపాదించుకున్నారు. అభ్యాస సంబంధమైన ప్రతి కార్యకలాపానికి దైవప్రేరేపితములు కాని, "పెద్దల పారంపర్యా చారాలు" ధర్మశాస్త్రం ప్రకారం విధింపబడినవిగా వారు తలంచుతారు (మార్కు 7:3). ఆ పారంపర్యాలను ప్రభువు నిర్లక్ష్యం చేసినప్పుడు (మత్తయి 15:1–14), వారు ఆయనకు కఠోరమైన శత్రువులుగా మారిపోయారు.[50]

### సద్దూకయ్యులు[51]

సొలొమోను క్రిందనున్న తొలి ప్రధాన యాజకుడైన సాదోకునుండి "సద్దూకయ్యులు" అనే పేరు వచ్చియుండవచ్చు (1 రాజులు 1:32, 34, 38, 45; యెహెజ్కేలు 40:46; 44:15లను చూడు). మహా హేరోదు కాలంనుండి యెరూషలేము పతనమయ్యేవరకు

ఉన్న ప్రతి ప్రధాన యాజకుడు సద్దూకయుడే. ఇది ధనవంతమైన ఏలికల తెగ, వారిలో అధిక సంఖ్యాకులు యాజకులే. పరిసయ్యులు ఆరంభమైన కాలంలోనే సద్దూకయ్యులు కూడా వచ్చినట్టు కొందరు నమ్ముతారు. వారు గ్రీకు విధానాలను అంగీకరిస్తారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో సహకరించే యిష్టం వారికి ఉన్నందున, వారు రాజకీయ బలంగా రూపొందారు. గ్రీకు తత్వ శాస్త్రాన్ని వారు అంగీకరించినందున, మరణాంతర జీవితాన్ని, పునరుత్థానాన్ని వారు నిరాకరించారు (మార్కు 12:18; అపొ. 23:6–8). వారు అధికారానికి ఆయన భీతి కలిగించినందున, వారు ప్రభువును ద్వేషింప నారంభించారు.

**ఇతర తెగలు**

సువార్త రచనలలో యితర తెగలు కూడా ప్రస్తావించబడ్డాయి. వాటిలో ఒకటి హేరోదీయులది (మత్తయి 22:16; మార్కు 3:6; 12:13; మార్కు 8:15 చూడు). హేరోదును పాలస్తీనా అంతటిపై సింహాసనాసీనునిగా చేయడానికి సమర్పించుకొని చురుకుగా పని చేసే తెగ.

జెలెతేవారు – ఖడ్గంతో రోమును జయించ సమర్పించుకున్న యూదుల తిరుగుబాటు దారుల గుంపు. ఈ గుంపులో ఒకడైన సీమోను అపొస్తలులలో ఒకడు అయ్యాడు (మత్తయి 10:4; మార్కు 3:18; లూకా 6:15).

మతేతర చరిత్రలో ఎసెన్నెస్ అని మరో తెగ ఉండినట్టు మనకు తెలుసు. వీరు సమాజంనుండి తమ్మును తాము వేరు చేసికొన్న మత సంబంధమైన ఉగ్రవాదులు. (వారు పరిసయ్యులతో ఆరంభమైయుండవచ్చు). కుమ్రాన్ సమాజము (ఖ్యాతిగాంచిన మృత సముద్రపు చర్మపు చుట్టల మూలంనుండి) ఎసెన్నెసులతో కలిసియుండేవారని తెలుస్తుంది. ఎసెన్నెసు అనేవారు బైబిల్లో కన్పించరు. బాప్తిస్మమిచ్చు యోహాను ఎసెన్నెసైయుండాలి, లేదా అతని బోధ మరియు ఆచరణ వారి వద్దనుండి తెచ్చుకొన్న దైనా అయి ఉండాలని తరచుగా వినిపించే వాదం తప్పుదుదని చెప్పడానికే నేను వీరిని ప్రస్తావించాను. దాన్ని కాదని నిరూపించడానికి మొదట ఆలాటి వాదాన్ని స్థిరపరచే రుజువు ఏదీ లేదు.[52]

## మెస్సీయాకు సంబంధించిన ఎదురు చూపులు

దేవుని మెస్సీయా కొరకు యూదులు కనిపెడుతున్నారని ఈ పఠన ఆరంభంలో ప్రస్తావించాను. మత్తయి సువార్తను పరిచయం చేస్తూ, నేను యిలా వివరించాను,

> "మెస్సీయా" అనేది "అభిషిక్తుడు" అని అర్థమిచ్చునట్టి హెబ్రీ పద రూపము. దీనికి గ్రీకు సమము "క్రీస్తు" (యోహాను 1:41). యాజకులను ... యితరులను నియమించుటలో అభిషేకము చేయబడేది; కాని "దేవుని అభిషిక్తుడ"నే పదం యూదుడు వినినప్పుడు, అతడు రాజును గూర్చి ఆలోచిస్తాడు (1 సమూ. 10:1; 24:6; కీర్తన. 2:2, 6లను చూడు).

ప్రభువైన యేసు, కడకు వచ్చేసరికి, మెస్సీయా రాకడను గూర్చిన ఎదురు చూపులు బహు ఎత్తయిన స్థాయిలో ఉన్నాయని నేను ముందుగానే తెలియజేశాను. బాలుడైన యేసును దేవాలయంలో సుమయోనును, అన్నయు ఆహ్వానించినప్పుడు ప్రదర్శించిన ఉత్సాహంలో యిది తేటగా కన్పిస్తుంది (లూకా 2:25–38). "ప్రభువు యొక్క క్రీస్తుకొరకు" సుమయోను ఎదురు చూస్తున్నాడు (లూకా 2:26). "యెరూషలేములో విమోచనకొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాటలాడుచుండినవారిలో" అన్న ఒకతె (లూకా 2:38). బాప్తిస్మమిచ్చు యోహాను తన పనిని ఆరంభించినప్పుడు, "ప్రజలు కనిపెట్టుచు, ఇతడు క్రీస్తయి యుండునేమో అని అందరును యోహానును గూర్చి తమ హృదయములలో ఆలోచించుకొను"చుండిరి (లూకా 3:15). "(క్రీస్తు అనబడిన) మెస్సీయా వచ్చునని" సమరయులు సహితం నమ్మారు (యోహాను 4:25). "దేవుని రాజ్యముకొరకు కనిపెట్టుచుండినవాడు"గా అరిమతయియ యోసేపు వర్ణించబడ్డాడు (లూకా 23:51). జనులు ఆయనను రాజుగా చేయ ప్రయత్నించినప్పుడును (యోహాను 6:15), ఆయన విజయోత్సవముతో యెరూషలేములో ప్రవేశించినప్పుడును ప్రజల అభిలాష తేటగా కన్పిస్తుంది (యోహాను 12:13).

మెస్సీయా రాక జనామోదము పొందిన చర్చనీయాంశమన్నది విదితమై యుంది. ఆయన జీవిత వివరాలు తెలియబడ్డాయి: ఆయన దావీదు సంతతియై ఉంటాడు (మత్తయి 22:42); ఆయన బేత్లెహేములో జన్మిస్తాడు (మత్తయి 2:5, 6; యోహాను 7:42). మెస్సీయాకు సంబంధించిన చర్చతో తనకు ముందుగా వచ్చువానిని గూర్చి ఊహ కూడా చర్చలోనికి తేబడింది (యోహాను 1:21; మత్తయి 16:14లను చూడు). అబద్ధపు క్రీస్తులు బయలుదేరి, ప్రజల నిరీక్షణను మరి ఎక్కువ చేశారు.[53]

ఈ నిరీక్షణ అంతటితో కూడ, యోహాను చెప్పిన మాటలు అర్థం చేసికొనడానికి కష్టంగా కన్పిస్తాయి: "ఆయన తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" (యోహాను 1:11). యూదులు సాధారణంగాను, యూదా మత నాయకులు ప్రత్యేకంగాను యేసును నిరాకరించడం క్రొత్త నిబంధనల్లో ముఖ్యమైన చర్చనీయాంశంగా ఉంది (మత్తయి 21:42; మార్కు 12:10; లూకా 17:25; అపొ. 4:11; 1 పేతురు 2:4, 7). ఎంతోకాలంగా వేచివున్న రక్షకునిగా యేసు ఎందుకు అంగీకారాన్ని పొందలేదు?

ప్రధానంగా, యేసు ఎందుకు తిరస్కారాన్ని పొందాడంటే యూదులకు రక్షకుని గురించి ముందే కొన్ని నిర్ణీతమైన ఊహలున్నాయి. వారు ముందే ఊహించుకున్నట్టుగా యేసు లేకపోవడం వల్ల అలా జరిగింది. పాత నిబంధన మెస్సీయా దావీదు రాజ్య వంశ వారసత్వానికి (కీర్తన. 89:3, 4) చెందిన వరుసలో దేవుడు పంపిన రాజు (యెషయా 9:6, 7)గా ఉంటాడని బోధించింది. మెస్సీయా శ్రమపొందు సేవకుడుగా ఉన్నట్టు పాత నిబంధనయు వర్ణించింది (కీర్తన. 22:1–21; యెషయా 53:1–12), అయితే ఈలాటి ప్రవచనాలు ఎక్కువగా నిర్లక్ష్యపెట్టబడ్డాయి. రోమీయులను ఓడించి దావీదు సొలొమోను కాలంలో ఉన్నట్టి రాజ్యాన్ని యూదులకొరకు తిరిగి స్థాపించడానికిగాను వారికి రాజకీయమైన సైనికపరమైన బలీయమైన రాజు కావాలనేది వారి మనస్సులో తేటగా

నిలిచియుంది. "నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు" అనే రాజు (యోహాను 18:36ఎ) దానిని చేయడు. ముందుగా తలంచిన "చతురస్రపు రంధ్రానికి," యేసు సరిపోని "గుండ్రని మేకై"యున్నాడు. ప్రజలు తమకొరకు సిద్ధపరచుకున్న దానికి ఆయన సరిపోని వాడుగా నిలిచాడు.

## ముగింపు

ఒక సరాసరి యూదా కుటుంబానికి సంబంధించిన జీవిత విధానంతోపాటు – క్రీస్తు జీవించిన దినాలను గూర్చిన వివరాలను యివ్వవచ్చు – కాని వాటికొరకు యింకా కొంత వేచియుండాలి. సువార్త రచనలకు అవి సంబంధం కలిగినప్పుడు అవి పరిచయం చేయబడతాయి.

యేసు ప్రవేశించే లోకానికి సంబంధించి, "ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను" మెస్సీయా ఎదుగుతాడనే ప్రవచనాన్ని గుర్తించడంతో దీన్ని ముగించుదాం (యెషయా 53:2). ఆయన రాకకొరకు దేవుడు పరిస్థితులను సిద్ధపరచాడు (గలతీ. 4:4), అయితే ప్రజల హృదయాలు మాత్రం ఎండిన భూమిలా నెరలు విడిచియున్నాయి. ఆతిథ్యం లేని ఈ వాతావరణంలోనికి, క్రీస్తు అవతరించాడు. చిట్టచివరికి, క్రీస్తునందలి విశ్వాసం ఎదిగి ఫలించి లోకమందంతట వ్యాపిస్తుంది.

---

సూచనలు

[1]బి. యస్. డీనే "బైబిలు చరిత్ర యొక్క సంక్షిప్త వర్ణన" అనే ట్రూత్ ఫర్ టుడే సంచికను చూడు. [2]ఇతర యూదులు తిరిగి రాక, తాము చెదరిపోయిన దేశాల్లో నివసించారు. వీరిని "చెదరినవారు" అని అంటారు (యోహాను 7:35; యాకోబు 1:1 చూడు). [3]పాత నిబంధన చివరి లేఖనం క్రీ.పూ. 430–425 ప్రాంతంలో వ్రాయబడింది. క్రొత్త నిబంధనలోని తొలి సంభవాలు – బాప్తిస్మమిచ్చు యోహాను జన్మకు సంబంధించినవి – క్రీ.పూ. 5 ప్రాంతంలో సంభవించాయి. ఈలాగున ఈ రెండింటి మధ్యకాలం 400 కంటె కొంచెం ఎక్కువ సంవత్సరాలు. [4]స్మిత్ యొక్క మూడు అవకాశాలను ఏరుకొని ఉపయోగించడమయ్యింది. (F. LaGard Smith, *The Narrated Bible in Chronological Order* [Eugene, Oreg.: Harvest House Publishers, 1984], 1338-39). [5]అవి పాత నిబంధన "ప్రామాణిక" గ్రంథాల్లో చేర్చలేదు. (పాత నిబంధనలోని రచనలు దైవప్రేరేపితాలుగా గుర్తించబడ్డాయి). [6]పాత నిబంధన లేఖనాల్లోనుండి ప్రభువైన యేసును ఆయన అపొస్తలులును తరచుగా కోట్ చేశారు గాని, అపొక్రిఫానుండి ఎవరును కోట్ చేయలేదు. [7]జొసీఫస్ వ్రాసిన యింకా రెండు రచనలు ఉన్నాయి. *Against Apion and Autobiography* వీటితో మనకు ప్రాముఖ్యత లేదు. [8]ప్రవచన సంబంధమైన కలకు యింకా యితర వివరాలు కూడా ఉన్నాయి. రోమా సామ్రాజ్యపు బలహీనతలాటివి. మనకు, ప్రవచనంలో ప్రాముఖ్యమైన సంగతి దేవుడు తన రాజ్యాన్ని స్థాపించుతాడనేది (దానియేలు 2:44). ఆ వాగ్దానము సంఘం స్థాపింపబడినప్పుడు నెరవేరింది. అయితే ప్రవచింపబడిన నాలుగు రాజ్యాల మీద మన దృష్టి నిలుపుతాం. "దానియేలు 1" ట్రూత్ ఫర్ టుడే (ఆంగ్ల) సంచికలో "ఒక గొప్ప ప్రతిమను గూర్చిన కల" మరియు "ఒక నిత్యరాజ్యం" అనే పాఠాలను చూడు. [9]మాదీయ పారసీకపు ఐక్య కూటమి లోకాన్ని జయించింది. అందువలన దీనిని మాదీయ పారసీక రాజ్యం అన్నాం. మరోవైపు, పారసీక దేశం అధిక ప్రభావాన్ని కనుపరచినందున, దీన్ని పారసీక సామ్రాజ్యమని కూడా పిలుస్తారు. అందువలన కొన్ని సార్లు నేను పారసీకుల ఏలుబడి అంటాను. [10]సంవత్సరాల సూచన కేవలం ఉరామరికగా చెప్పబడేవే – పరిపూర్ణమైనవి కావు. ఆయా కాలాలకు సంబంధించి యివ్వబడిన కాలాలు పాలస్తీనా ఏలుబడికి మాత్రమే సూచింపబడ్డాయి.

[11]సమరయులకు సంబంధించి ఎక్కువ వివరాలకు “కార్యగ్రంథం భాగం 2”ను చూడు. [12]దీనిని “మాసిదోనియుల కాలమని” కూడా అంటారు – మహా అలెగ్జాండరు మాసిదోనియవాడు గనుక. దానియేలు 8:21 “గ్రీసు” అనే పదాన్ని వినియోగిస్తుంది. దానినే మనం యిక్కడ ఉపయోగిస్తాం. [13]*koine* గ్రీకు అనేది ఆనాడు సామాన్య మానవుడు మాట్లాడే గ్రీకు భాష. [14]మహా అలెగ్జాండరు సామ్రాజ్యం నాలుగు భాగాలుగా విడిపోతుందని దానియేలు 8:8, 21, 22ల్లో ప్రవచింపబడింది. [15]“టాలమీలు” అనే పేరు (Ptolemies) ఐగుప్తును వశపరచుకున్న సైన్యాధిపతి పేరునుండి వచ్చింది. [16]సిరియాను వశపరచుకున్న సెల్యూకస్‌నుండి “సెలూసిడ్” అనే పేరు వచ్చింది. [17]దేశ పటం చూడు. [18]సెప్టూజెంట్‌పై యింకా ఎక్కువైన సమాచారానికి “కార్యగ్రంథం భాగం 1”ని చూడు. [19]దానియేలులోని పలు ప్రవచనాలు అంతియోకస్ ఎపిఫినాస్ యొక్క క్రూరమైన ఏలుబడిని సూచిస్తున్నట్టు సాధారణమైన అంగీకారముంది (ఉదాహరణకు, దానియేలు 8:9–11). Smith, 1346. [20]యూదులకు పంది అపవిత్రమైన జంతువు (లేవీయ. 11:3, 7).


[21]దీనిని ఆస్మోనియన్ కాలమని కూడా అంటారు. మెక్కబ్బీలను గూర్చిన వివరాలు “కార్యగ్రంథం భాగం 3”ను సంచికలో యివ్వబడ్డాయి. [22]ప్రధాన యాజకుడు అహరోను సంతతివాడై యుండాలని మోషే తెలిపాడు (నిర్గమ. 29:9; సంఖ్యా. 25:10–13) – పెద్ద కుమారుడైయుండాలి. అయితే మోషే మాటలు నిర్లక్ష్యపెట్టబడినట్టు కన్పిస్తాయి. [23]రోము యెరూషలేమును క్రీ.శ. 70లో నాశనం చేసింది. [24]ఆ కాలంలో, రోము పాంపే, జూలియస్ సీజర్‌తో చేరి ముగ్గురిచే పాలింపబడినట్టుంది. కడకు, జూలియస్ సీజర్ వశపరచుకున్నాడు. [25]“ప్రకటన –1”ని (ట్రూత్ ఫర్ టుడే, ఆంగ్ల సంచికను) చూడు. [26]మహా హేరోదు, అతని కుటుంబపు పూర్వ గాథ నిమిత్తం “కార్యగ్రంథం భాగం 5” చూడు. [27]“కార్యగ్రంథం భాగం 3”ను చూడు. [28]దేశ పటం చూడు. [29]“బాషాను” తరచుగా పాత నిబంధనలో ప్రస్తావించబడింది (యెహోషువ 22:7; 1 దినవృ. 6:71; యెషయా 33:9), క్రొత్త నిబంధనలో ప్రస్తావించబడలేదు. [30]దేశ పటాన్ని చూడు.

[31]కైసరు ముద్రగల నాణ్యాలు అమలులో ఉన్నాయి (మత్తయి 22:20), రోముకు తమ పన్నులు చెల్లించడంలో తప్ప, యూదులు “శాపగ్రస్తమైన నాణ్యాలను” వారు పట్టుకోనవసరం లేదు. [32]పాత నిబంధనలో KJV ఒక్కసారి “పాలస్తీనా” అనే పేరు – యోవేలు 3:4లో కన్పిస్తుంది. NASB దాన్ని “ఫిలిష్తియ” అని తర్జుమా చేస్తుంది. [33]“పాలస్తీనా” అనే పేరు ఫిలిష్తీయులనుండి వచ్చింది. కనానుకు దక్షిణ తీరాన ఫిలిష్తీయులు నివసించారు (జెఫన్యా 2:5 చూడు). మెక్కబ్బీలు ఫిలిష్తీయులతో యుద్ధం చేశారు. కాని ఫిలిష్తీయుల పేరు క్రొత్త నిబంధనలో ప్రస్తావించబడలేదు. వారు యూదా దేశంలో కలిసిపోయినట్టు కొందరు భావిస్తారు. [34]John D. Davis, “Palestine,” *A Dictionary of the Bible*, 4th ed. (Grand Rapids, Mich.: Baker Book House, 1956), 562. [35]పాలస్తీనా సైజును మీ ప్రాంతీయ రాష్ట్రాలతో పోల్చి చూడు. అప్పుడు పాలస్తీనా ఎంత చిన్నదో శ్రోతలకు అర్థమౌతుంది. [36]పాలస్తీనాను గూర్చిన సమాచారం కొరకు B. S. Dean, “క్రొత్త నిబంధన చరిత్ర సంక్షిప్త వర్ణనను” చూడు. [37]29, 39ల పై ఉన్న సూచనలు చూడు. [38]ఆ ప్రాంతంలో పదికంటె ఎక్కువ పట్టణాలే ఉన్నాయి. అయితే పది మాత్రమే ప్రాముఖ్యమైనవిగా ఎంచబడినట్టున్నాయి. [39]దేవాలయం క్రీ.శ. 60లవరకు పూర్తి చేయబడలేదు. రోమా సైన్యంచే క్రీ.శ. 70లో – కొద్ది కాలంలోపే అది పడగొట్టబడింది. ఆ సమయానికి నిర్మాణ కార్యక్రమం యింకా ముగియలేదని కొందరు నమ్ముతారు. [40]పండుగల మీద చార్టు చూడు. బూరల పండుగ, పూరీము పండుగ తప్ప మిగిలిన పండుగలన్నీ క్రొత్త నిబంధనలో ప్రస్తావించబడ్డాయి.

[41]“సునగోగు” వారు కూడే కట్టడాన్ని గాక, జనులను సూచిస్తుంది. కాని, క్రొత్త నిబంధనలో తరచుగా ప్రజలు కూడే స్థలానికి ఆ మాట సూచింపబడినట్టుంది – సమాజ మందిరం (లూకా 7:5). [42]సమాజ మందిరాన్ని గూర్చి ఎక్కువగా తరువాత మాట్లాడతాం. ఉదాహరణకు వారి నాయకులు “పెద్దలని” పిలువబడ్డారు. సువార్త రచనల్లో “పెద్దలు” అంటే, సమాజ మందిరపు నాయకులే (లూకా 7:3–5), కొన్ని సార్లు మత సంబంధమైన యితర నాయకులను సూచిస్తుంది. [43]“రబ్బీ” అంటే – “నా బోధకుడా” అనేది హెబ్రీ పదం యొక్క అర్థం. గౌరవ సూచనగా, శిష్యులు ప్రభువైన యేసును “రబ్బీ” అని పిలిచారు. (“రబ్బూని” అన్న “రబ్బీ” అనే పద మార్పులే యోహాను 20:16 చూడు). మత్తయి 26:25; మార్కు 9:5; యోహాను 3:2). [44]ఈ వ్యాఖ్యానాలన్నీ “The Talmud” అనే గ్రంథంగా కాలక్రమంలో సమకూర్చబడ్డాయి. [45]2 సమూ. 8:17 చూడు. “లేఖకుడు” అని తర్జుమా చేయబడింది. [46]ధర్మశాస్త్రోపదేశకులను “డాక్టర్” అనే పదంలో KJV కొన్ని సార్లు సూచిస్తుంది (లూకా 2:46; 5:17). [47]శాస్త్రులపై ఎక్కువైన సమాచారం కొరకు “కార్యగ్రంథం భాగం 2”లో చూడు. [48]సన్‌హెడ్రిన్‌పై ఎక్కువ సమాచారం కొరకు “కార్యగ్రంథం భాగం 1”ని చూడు. [49]పరిసయ్యులపై విస్తరించిన చర్చ “కార్యగ్రంథం భాగం 1”ని చూడు. [50]“పరిసయ్యులనే పులిపిండిని” గూర్చి “క్రీస్తు జీవితం” పరంపరలను చూడు.

[51]సద్దూకయ్యులను గూర్చిన ఎక్కువ వివరాలకు “కార్యగ్రంథం భాగం 1”ని చూడు. [52]దేవునిచే దేవుని సందేశంతో యోహాను పంపబడినట్టు క్రొత్త నిబంధన బోధిస్తుంది (యోహాను 1:6; లూకా 3:2). పైగా, బోధలోను, ఆచరణలోను

యోహానుతో ఎసెన్నెసులను పోల్చితే అనేక వ్యత్యాసాలు కన్పిస్తాయి. [53]తాను వెళ్లిన తరువాత యిది సంభవించునని ప్రభువు తన శిష్యులకు తెలియజేశాడు (మత్తయి 24:5, 23, 24). ఆయన జన్మకు ముందు కూడా ఈలాటి సంఘటనలు సంభవించినట్టు ఎక్కువ మంది పండితులు నమ్ముతారు. అపొ. 5:36, 37 యిద్దరు నటనమాడినవారిని గూర్చి చెప్పుతున్నట్టుంది.



# యూదుల పండుగలు[1]

| పండుగ పేరు | అది ఎలా పిలువబడింది | ఆచరించే నెల | పవిత్ర సంవత్సరపు నెల | సాధారణ సంవత్సరపు నెల | ఇంగ్లీషు నెల పేరు | కాలమెంత | ఎక్కడ ఆచరించాలి | ఆచరించడంలో ప్రధానాంశం | అది దేనికి గుర్తు | ఇతర పేర్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పస్కా | మహా పండుగ | నీసాను లేక అబీబు | మొదటి | 7వ | ఏప్రిల్ | 1 వారం | యెరూషలేం | పస్కా పశువును భుజించడం | సంహారకుడు దాటిపోవడం జగుపును విడిచిపెట్టుట | పులియని రొట్టెలు |
| పెంతెకొస్తు | మహా పండుగ | సివన్ | 3వ | 9వ | జూన్ | 1 రోజు | యెరూషలేం | గోధుమ తొలి ఫలములకు ప్రతిగా రెండు రొట్టెలను అర్పించుట | సీనాయి పర్వతమందు ధర్మశాస్త్రం యివ్వబడుట | వారములు ప్రథమ ఫలములు గోధుమ పంట |
| పర్ణశాలలు | మహా పండుగ | టిస్రి లేక ఇతానిమ్ | 7వ | మొదటి | అక్టోబరు | 1 వారం | యెరూషలేం | పర్ణశాలలలో నివసించడం | అరణ్యంలోని జీవితం | ఫల సంగ్రహం |
| బూరలు | తక్కువ పండుగ | టిస్రి లేక ఇతానిమ్ | 7వ | మొదటి | అక్టోబరు | 1 రోజు | ఎక్కడైనా | బూరలు ఊదుట | నూతన సంవత్సర దినం | |
| ఆలయ ప్రతిష్ఠ | తక్కువ పండుగ | కిస్‌లూ | 9వ | 3వ | డిసెంబరు | 8 రోజులు | ఎక్కడైనా | ఆనందించుట, పాడుట, దీపములు వెలిగించుట ఎస్తేరు గ్రంథం చదువుట | ఆలయ ప్రతిష్ఠ అన్యుల యొద్దనుండి తిరిగి పట్టుకున్న తరువాత | దీపములు |
| పురీము | తక్కువ పండుగ | ఆదారు | 12వ | 6వ | మార్చి | 2 రోజులు | ఎక్కడైనా | ఎస్తేరు గ్రంథం చదువుట | రాణియైన ఎస్తేరు యూదులను కాపాడుట | |

[1]Reprinted from *Training for Service* by Orrin Root © 1964. Revised By Eleanor Daniel © 1983, Standard Publishing. Used by permission.

# క్రీస్తు జీవితంలోని

# పొందిక విషయాల పఠనం

మనం మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలను పఠించనారంభించాం. ఈ పుస్తకంలో, మనం చదువబోవు పొందిక భాగాన్ని తొలిగా కనుగొంటాం. మిగిలిన ఈ పుస్తకంలో, చదువుటకు నియమించిన వాటిపై ఆధారపడిన పాఠం, పాఠ్య లేఖనాలపై ఇచ్చిన వివరణకు బదులుగా ఉంది. పొందికలోని ప్రతి భాగం ఉపదేశ శాస్త్రమును అనుసరించి ఉండేటట్లు ప్రయత్నించచడమయ్యింది. అలా చేయడంలో రెండు ఉద్దేశాలున్నాయి: (1) అయినంతవరకు ప్రతి పాఠం ఆసక్తిగలదిగా ఉండుటకు, (2) పెద్ద వాక్య భాగాలను త్వరలో ఎలా సర్వేక్షించాలో ఉదహరించుటకు. ఇలాటి విధానం "క్రీస్తు జీవితం" పరంపరయంతట కొనసాగుతుంది.

ఉత్తేజపరచు పఠనం మన ముందు ఉంది. క్రీస్తు జీవితమును పఠించుటలో అధిక సమయాన్ని గడపనై ఉన్నాం. మనము "క్రీస్తు యొక్క అడుగుజాడలయందు నడుచు కొనునట్లు" ఆయన మనకు "ఒక మాదిరిని" విడిచి వెళ్లాడు (1 పేతురు 2:21), మరియు ఆ యజమానుని అడుగుజాడలను మనం అధికంగా కనుగొందాం.

# పొందిక

I. **తన పరిచర్యకు ముందు క్రీస్తు జీవిత కాలం.**
   A. లూకా తొలిపలుకు, సమర్పణ (లూకా 1:1-4).
   B. యోహాను పరిచయం (యోహాను 1:1-18).
   C. మత్తయి యిచ్చిన యేసు వంశావళి (మత్తయి 1:1-17).
   D. లూకా యిచ్చిన యేసు వంశావళి (లూకా 3:23-38).
   E. స్నానికుడైన యోహాను జన్మను గూర్చి జెకర్యాకు దేవదూత ప్రకటన (లూకా 1:5-25).
   F. యేసు జన్మను గూర్చి మరియకు దేవదూత ప్రకటన (లూకా 1:26-38).
   G. (ప్రభువుకు తల్లి కాబోతున్న) మరియ (స్నానికుడైన యోహానుకు తల్లి కాబోతున్న) ఎలీసబెతును దర్శించడం (లూకా 1:39-56).
   H. స్నానికుడైన యోహాను జననము, తొలి దినాలు (లూకా 1:57-80).
   I. యేసు జన్మను గూర్చి యోసేపుకు ప్రకటన (మత్తయి 1:18-25).
   J. యేసు జననము (లూకా 2:1-7).
   K. యేసు జన్మను గొర్రెల కాపరులకు ప్రకటించారు (లూకా 2:8-20).
   L. యేసు నామకరణము, సున్నతి; దేవాలయపు సేవ (లూకా 2:21-39).
   M. తూర్పు దేశపు జ్ఞానులు యేసును దర్శించుట (మత్తయి 2:1-12).
   N. ఐగుప్తునకు పారిపోవుట, బేత్లెహేములో మగ శిశువులను సంహరించుట (మత్తయి 2:13-18).
   O. బాలుడైన యేసును ఐగుప్తునుండి నజరేతుకు తెచ్చుట (మత్తయి 2:19-23; లూకా 2:39బి చూడు).
   P. నజరేతులో యేసు జీవించడం; పన్నెండేండ్ల ప్రాయంలో యెరూషలేమును దర్శించడం (లూకా 2:40-52).

II. **స్నానికుడైన యోహాను పరిచర్య ఆరంభం.**
   A. యోహాను పరిచర్య (మత్తయి 3:1-6; మార్కు 1:1-6; లూకా 3:1-6).
   B. యోహాను సందేశం (మత్తయి 3:7-12; మార్కు 1:7, 8; లూకా 3:7-18).

III. **యేసు సువార్త ఆరంభము.**
   A. యొర్దాను నదిలో యేసు యోహానుచే ముంచడం పొందాడు (మత్తయి 3:13-17; మార్కు 1:9-11; లూకా 3:21, 22; యోహాను 1:31-34).
   B. యేసు అరణ్యంలో శోధింపబడెను (మత్తయి 4:1-11; మార్కు 1:12, 13; లూకా 4:1-13).
   C. యేసును గూర్చి యోహాను సాక్ష్యము (యోహాను 1:19-34).

D. (యూదయలో) క్రీస్తు తొలి శిష్యులు (యోహాను 1:35–51).
E. (గలిలయలోని కానాలో) యేసు మొదటి అద్భుతం (యోహాను 2:1–11).
F. (గలిలయలో) యేసు తొలి నివాసం కపెర్నహూములో (యోహాను 2:12).

IV. **యేసు పరిచర్యలో మొదటి పస్కా నుండి రెండవ దానికి.**
A. యేసు పరిచర్యలో తొలి పస్కా.
1. దేవాలయాన్ని శుద్ధీకరించడం (యోహాను 2:13–25).
2. నీకొదేముకు ఉపదేశించడం (యోహాను 3:1–21).
B. యూదయలో పరిచర్య (యోహాను యింకను సాక్ష్యమివ్వడం) (యోహాను 3:22–36).